క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మించారు.. రోడ్డు మరిచారు



రోడ్డు వేయకపోవడంతో బయటకు వచ్చిన మెటల్స్

దెందులూరు: మూడు నియోజకవర్గ ప్రయాణికులు, పాదచారులకు ఉపయోగపడే గుండుగొలను బ్రిడ్జి నిర్మాణం చేశారు. బ్రిడ్జికి మెయిన్ రోడ్డుకి మధ్య రోడ్డు నిర్మించలేదు. పది మీటర్ల రోడ్డు నిర్మాణం చేస్తే బ్రిడ్జి రోడ్డు మెయిన్ రోడ్డు కలిసి పోయేదని 80 శాతం పని చేసి అవసరమైన రోడ్డును వేయకపోవడం ఏమిటని ఈ రోడ్డుపై ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని వర్షాలకు పటిష్టమైన రోడ్డు లేకపోతే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ఏలూరు(టూటౌన్): గుర్రం జాషువా జయంతిని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందని ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారధి అన్నారు. ఏలూరు తంగెళ్లమూడిలోని ఇజ్రాయేలుపేటలోని బాబుజగజ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరై గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ వినుకొండలో పుట్టి ప్రపంచానికి జ్ఞానాన్ని అందించారని, విలక్షణమైన వ్యక్తిత్వం కలవారని ఆయన నాటకాలు చూస్తేనే తెలుస్తుందన్నారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, ఏఎంసీ వైస్ చైర్మన్ వాణి భాస్కర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరణాల మాలతీ రాణి , లంకా వెంకటేశ్వర్లు, కొరళ్ళ జ్యోతి సుధాకర్ కృష్ణ పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో సమస్యల తిష్ట

- డ్రెయినేజీ సమస్య తీవ్రం
- దోమలు, పందులతో నిత్యం అవస్థలు



రెడ్డమ్మ స్ట్రీట్ 2వ రోడ్డులో ఇళ్ల మధ్యే మురుగుకూపం



డ్రెయినేజీ నిర్మాణం లేని వీధి

ఏలూరు రూరల్: ఏళ్ల తరబడిన మా సమస్య పరిష్కారం కావడం లేదని ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి 24వ డివిజన్ జేపీఆర్ నగర్ ప్రజలు వేడుకుంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇళ్లల్లో వాడుక నీరు లోతట్టు ప్రాంతాల్లో చేరి మురుగుకూపాలుగా మారుతున్నాయని వాపోతున్నారు. దోమలు, పందులతో సహవాసం చేయాల్సి దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా సమస్య కన్నెత్తి చూసే నాథుడే లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సమస్య పరిష్కరించకపోయినప్పటికీ క్రమం తప్పకుండా ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూలు చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు వచ్చి మీ సమస్య పరిష్కరిస్తాం అంటూ వాగ్దానాలు చేశారని, ఎన్నికలు పూర్తికాగానే మరిచిపోయారని ఎద్దేవా చేస్తున్నారు.

నివాసాల మధ్య మురుగు

స్థానిక రెడ్డమ్మ స్ట్రీట్‌లో 1, 2 రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థలేదు. ఈ ప్రాంతంలో సుమారు 40కు పైగా భవనాలు, ఇళ్లు ఉన్నాయి. ఈ భవనాల్లో వాడుక నీరు బయటకు పోయే దారిలేకపోవడంతో లోతట్టు స్థలాల్లో చేరుతోంది. దీంతో పందులు సంచారం పెరిగి, పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుంది. దీనికి తోడు దోమలు సైతం వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా స్థానికులు దోమలతో వేగలేక చీకటిపడగానే కిటికీలు, తలుపులు మూసుకుంటున్నారు. అయినప్పటికీ దోమల బెడదతో పిల్లలు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారని మహిళలు వాపోతున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు రెట్టింపవుతున్నాయి. మురుగునీటితో పాటు వర్షం నీరు సైతం ఖాళీ స్థలాల్లో చేరి పరిసరాలను మరింత అధ్వానంగా మారుతున్నాయి. వర్షాకాలంలో మురుగు కూపాలు మారుతున్న స్థలాలు వేసవికాలం వరకూ సమస్యలు సృష్టిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

ఈ ప్రాంతో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయకపోవడం వల్ల ప్రజలు పడుతున్న అవస్థలను వివరిస్తూ స్థానికుడు ఎం.సూర్యచంద్రరావు కొద్దికాలం క్రితం జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు సైతం బుట్టదాఖలైంది. కార్పొరేషన్ అధికారులు ఫిర్యాదుపై కనీసం స్పందించలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ అభివృద్ధిచేయాలని కోరుతున్నారు.

ఖాళీ స్థలాలు.. మురుగుకూపాలు



ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. కాని అధికారులు డ్రైయినేజీ అభివృద్ధి చేయలేదు. కనీసం ప్రధాన డ్రెయినేజీ అభివృద్ధి చేసిన చాలు. ఇళ్ల ముందు డ్రెయినేజీ నివాసితులు కట్టుకుంటారు. అధికారులు నిర్లక్ష్యం వల్ల మా ఇంటి మధ్య ఖాళీ స్థలం మురుగుకూపంగా మారిపోయింది. దీని కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి.

– ఎం.జ్యోతిప్రసాద్, స్థానికుడు

పందులు పెరిగిపోయాయి



ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరడం వల్ల పందులు పెరిగిపోయాయి. రాత్రి, పగలు ఇళ్ల మధ్య ఉంటున్నాయి. కొన్ని నెలల క్రితం ఒకటి లేదా రెండు పందులు ఉండేవి. ఇప్పుడు ఏకంగా పదుల సంఖ్యలో పందులు వస్తున్నాయి. వీటివల్ల ఒక్కటే దర్వాసన. పందుల కారణంగా ఇంటిలో కూడా ఉండలేకపోతున్నాం. కనీసం పందులను నివారించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఎం.సాయిదుర్గ, స్థానికురాలు

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఏలూరు(టూటౌన్): దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా తుంచి అమరుడైన మహోన్నత వ్యక్తి భగత్ సింగ్ అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమశంకర్ కొనియాడారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో భగత్‌సింగ్ 118 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమశంకర్ మాట్లాడుతూ దేశంలోనిరుద్యోగం, ప్రభుత్వాలు, యువత వ్యతిరేక విధానాలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలన్నారు. చిన్నతనం నుంచి దేశ స్వాతంత్ర్య కాంక్ష కలిగి బ్రిటిష్ వారి నుండి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావాలని నిరంతరం భగత్ సింగ్ ప్రయత్నం చేశారని కొనియాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, సీపీఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శులు కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా,కార్యవర్గ సభ్యులు కొల్లూరి సుధారాణి, కొండేటి బేబీ, బళ్ల కనకదుర్గా రావు, లక్కోజు జగదీశ్వరి, ఎంఏ హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



మహాచండీదేవి అలంకరణలో పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మవారు



మహాచండీదేవి అలంకరణలో 12 పంపుల సెంటరు కనకదుర్గమ్మ



మహాచండీ దేవి అలంకరణలో దత్తాశ్రమంలో అమ్మవారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఆరో రోజున ఆదివారం వివిధ అమ్మవార్ల ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసి, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పత్తేబాద శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో, 12 పంపుల సెంటరు కనకదుర్గమ్మ, దత్తాశ్రమంలో అమ్మవారు శ్రీ మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మురుగులో వేట



డ్రెయినేజీలో గాలిస్తున్న బాలురు

ద్వారకాతిరుమల: కొన్ని ప్రాంతాల్లో వజ్రాల వేట జరుగుతుందని మనం విన్నాం. ద్వారకాతిరుమలలో ఇదే తరహాలో కొందరు బాలలు విలువైన వస్తువుల కోసం డ్రెయినేజీల్లో వేట మొదలు పెట్టారు. చేటతో మురుగును పట్టి అందులో గాలిస్తున్నారు. యాత్రా స్థలం కావడంతో లాడ్జిలు, సత్రాల్లోని గదుల్లో ఉండే భక్తులు, అలాగే గృహాల్లోని వారు పోగొట్టుకునే చిన్నచిన్న బంగారు, వెండి వస్తువులు డ్రెయినేజీల్లో కొట్టుకెళ్తాయని వీరు భావిస్తున్నారు. అందుకే ఈ నలుగురు బాలలు ఆదివారం స్థానిక గ్రంధాలయం రోడ్డులోని డ్రెయినేజీలో ఇలా వెదుకులాడుతూ కనిపించారు.

మానవత సేవలు అభినందనీయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మానవత సంస్థ అధ్యక్షుడు కుమార్, ప్రతినిధులు

ఏలూరు టౌన్: మానవత సంస్థ ఏలూరు యూనిట్ సేవలు అభినందనీయమని, సమాజంలో అవసరతలో ఉన్న వారికి సహాయం చేయటమే లక్ష్యంగా తమ సేవలు విస్తృతం చేస్తున్నారని గౌరవ అతిథి జీఎస్టీ, ఇన్‌కం ట్యాక్స్ ప్రాక్టీసనర్ సూరే చంద్రశేఖర సాయి అన్నారు. మానవత ఏలూరు యూనిట్ నెలవారీ సమీక్ష సమావేశం ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో సంస్థ అధ్యక్షుడు ఎంఎస్ఎంఎస్ కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. నెలవారీ కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలు, నివేదికలు, వచ్చే నెలలో చేపట్టే కార్యక్రమాల ప్రణాళికలపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా 15మంది విద్యార్థులకు చదువుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని , ఇద్దరు కళాకారులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇద్దరు వ్యక్తులకు వైద్య సహాయంలో భాగంగా రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకుని ఆయుష్ హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బొప్పన దశరథ్ గుండె సంబంధిత వ్యాధులపై వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా సెంట్రల్ కమిటీ కన్వీనర్ పోలవరపు దేవరత్నాకర రావు, జిల్లా పూర్వ అధ్యక్షులు దేవినేని భాస్కర రావు, ఏలూరు యూనిట్ కార్యదర్శి పూర సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు, సహకార కమిటీ చైర్మన్ పోడూరి కనకదుర్గ, మహిళా ఆరోగ్య అవగాహన కమిటీ చైర్మన్ మేడికొండ పద్మజ, కల్చరల్ యాక్టివిటీస్ చైర్మన్ దువ్వి హేమసుందర్, కందాడై శ్రీరంగనాయకి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పంటల బీమా అమలు చేయాలి

దెందులూరు: గత ప్రభుత్వంలో అమలు చేసినట్లుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని, 2024 ఖరీఫ్ సీజన్ పంటల బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీమా ప్రీమియం స్వచ్ఛంద నమోదు పద్ధతిలో రైతులు చెల్లించి నమోదు చేసుకోవాలని, 2024 రబీ సీజన్ నుంచి ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తుందని చెప్పారు. రైతుల వాటాగా చెల్లించాల్సిన బీమా ప్రీమియం మొత్తాన్ని భారీగా పెంచాయన్నారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

30న అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన



గొల్ల కిరణ్, గంటా పండు

దెందులూరు: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 30న అన్ని చోట్ల ఉన్న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శులు గొల్ల కిరణ్, గంటా పండు కోరారు. ఆదివారం కొవ్వలిలో విలేకరులతో మాట్లాడుతూ పేదలకు ఉచితంగా విద్య వైద్యం శాశ్వతంగా అందాలన్న దృక్పథంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశానికే ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దరన్నారు. దాదాపు మూడు వేల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారని తెలిపారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యాన్ని, విద్యను దూరం చేసే విధంగా తీసుకున్న నిర్ణయం పేదలకు శాపమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎండగట్టకపోతే పేదలు విద్యకు, వైద్యానికి దూరమవుతారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఈనెల 30న నిరసనను కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర కార్యదర్శులు గొల్ల కిరణ్, గంటా పండు కోరారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సాల్వేషన్ ఆర్మీ, సంఘ పెద్దలు

దెందులూరు: ప్రభుత్వం చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి, మానవ అక్రమ రవాణా అరికట్టాలని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, రిటైర్డ్ టెరిటోరియల్ కమాండర్ జోషియా అన్నారు. ఆదివారం సాల్వేషన్ ఆర్మీ మెయిన్ చర్చి గౌడ వీధిలోని మిలీనియం చర్చిలో యాంటీ విమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కోర్ ఆఫీసర్ రమణయ్య ప్రారంభించారు. గౌడ వీధి మంచినీటి చెరువు, బస్టాండ్ సెంటర్, మెయిన్ చర్చ్ వైఎస్సార్ సర్కిల్ మీదుగా ర్యాలీ చేశారు. టీచర్ కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ పేదరికం నిరక్షరాస్యత మోసపూరిత వాగ్దానాలు నిరుద్యోగం ఉమెన్ ట్రాఫికింగ్‌కి ప్రధాన కారణాలు అన్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలన్నారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా చదివించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి, హక్కులు, బాధ్యత, చట్టాలు శిక్షలు సమాజంలో పరిస్థితులు అవగాహన కలుగుతాయన్నారు.

ఎర్రాప్రగడకు కేవీఎస్ సాహిత్య ప్రతిభా పురస్కారం

ఏలూరు(ఆర్ఆర్‌పేట): రెండు దశాబ్దాలుగా అంతర్యామి ఆధ్యాత్మిక వ్యాసాలు, ఎన్నో శీర్షికలు ఎర్రా ప్రగడ నిర్వహిస్తున్నారని కళారత్న కేవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక సాహిత్య మండలి పుల్లాబోట్ల శ్రీరామమూర్తి ప్రాంగణంలో దసరా సాహిత్యోత్సవం- 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విదేశాల్లో కూడా సాహిత్య ప్రసంగాలు, ప్రవచనాలు చేశారన్నారు. గోదావరి గలగలలు, చీకట్లోంచి వెలుగులోకి, చెంగల్వపూదండ, కావ్యప్రబంధాలతో రచనలు చేశారన్నారు. ఈ సందర్భంగా కేవీఎస్‌ట్రస్టు, సాహిత్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని ఎర్ర ప్రగడ అన్నారు. అనంతరం గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వం అందించిన ఉగాది పురస్కార సభలో కళారత్న అవార్డు పొందిన ఏలూరుకి చెందిన నాట్యమయూరి పార్వతీ రామచంద్రన్, ఉగాది పురస్కారాలు అందుకున్న దువ్వి రామారావు సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, గరికపాటి కాళిదాసు,పెద్దపాటి రామకృష్ణ , ఆలపాటి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

నేడు నిడమర్రు మండల సర్వసభ్య సమావేశం

నిడమర్రు: స్థానిక మండల పరిషత్ భవనంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిడమర్రు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులతో పాటు మండలంలోని మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	44
బీరకాయలు	36	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	76-96
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

మూగజీవాలకు సీజనల్ ముప్పు

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి
- అక్టోబర్ 15 వరకు టీకాలకు అవకాశం



టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి సందీప్

నిడమర్రు: వాతావరణంలో మార్పులు, ఉపరితల ఆవర్తనంతో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో విపరీగా కురుస్తున్న వర్షాలు మూగ జీవాలపై ప్రభావం చూపుతాయని పశు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని చెబుతున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పెంపకందారులు నష్టపోవాల్సి వస్తుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 15వ తేదీ వరకూ నిర్వహిస్తున్నారు. పశువుల్లో సోకే వ్యాధుల్లో గాలి కుంటు వ్యాధి ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలను పాడి రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని పశు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఈ వ్యాధి నివారణపై పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు టీకాల కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తుంది.

పశువుల్లో ఇలా గుర్తించాలి

పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలను సులువుగా గుర్తించొచ్చని పశువైద్య సిబ్బంది చెబుతున్నారు. పశువుల్లో తీవ్రమైన జ్వరం రావడంతో పాటు నీరసించిపోతాయి. నోటి నుంచి తీగల వలే సొంగ కారుతూ ఉంటుంది. నోటి వద్ద, కాలి గిట్టల వద్ద పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా ఇవి తట్టుకోలేవు. చూడి పశువులు అయితే ఈసుకుపోతాయి. వీటి పాలు తాగే దూడలు మరణిస్తాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో పాటు పశువుల పని సామర్థ్యం అంతే స్థాయిలో తగ్గుతుంది. దీని వలన పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వైద్యంపై నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయి. ఈ వ్యాధికి టీకాలే పరిష్కామరమని వైద్యులు చెబుతున్నారు.

నివారణ ఇలా..

నాలుగు నెలల వయసు దాటిన పశువులు, జీవాలకు ముందు జాగ్రత్త చర్యగా ఈ గాలికుంటు వ్యాధి టీకా వేయించాలి. ఆవులు, గేదెలకు 2 మిల్లీ లీటర్ల చొప్పున టీకా ఇవ్వాలి. ఆరు నెలలకోసారి టీకా వేయిస్తే గాలికుంటు వ్యాధి దరి చేరదు, ప్రభుత్వం ఉచితంగా టీకా వేస్తుంది. దీని వలన పాడి రైతుకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పని సామర్థ్యం తగ్గకుండా కాపాడొచ్చు. దూడల్లో మరణాలు సంభవించవు. అవి ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు ఉపయోగపడతాయి.

సద్వినియోగం చేసుకోవాలి



గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 15వ తేదీ నుంచి టీకాలు ప్రారంభించాం. షెడ్యూల్ ప్రకారం ఈనెల 30వ తేదీతో మండలంలో ముగుస్తుంది. అయినా వచ్చే నెల 15 వరకూ ఈ టీకాల డోసులు అందుబాటులో ఉంటాయి. పాడి రైతులు వినియోగించుకోవాలి.

– వి.సందీప్, మండల పశు వైద్యాధికారి